ఈనాడు
విజయనగరం
సోమవారం ఆగస్టు 31, 2026

ఎన్నికలకు శ్రేణులు సిద్ధం కావాలి


సమావేశంలో ముఖ్య నాయకులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం పార్లమెంట్ పరిధిలో ఎంపీ, ఎమ్మెల్యేల ఆత్మీయ సమావేశం ఆదివారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు నివాసంలో నిర్వహించారు. పార్లమెంటరీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో స్థానిక ఎన్నికలపై చర్చ జరిగింది. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయాలని నిర్ణయించారు. వందశాతం విజయం కోసం కృషి చేయాలని కోరారు. ముందుగా నగర, పురపాలక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. రెండేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, ఇంటింటికీ తెదేపా పెద్దఎత్తున నిర్వహించాలని సూచించారు. పలు అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తీర్మానాలు చేశారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకటరావు, కోండ్రు మురళీమోహన్, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్ పీజీ

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఆదివారం నీట్ (జాతీయ అర్హత పరీక్ష) పీజీ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు గాజులరేగ అయాన్ డిజిటల్ జోన్‌లో పరీక్ష జరిగింది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి 475 మందికి 464 మంది హాజరయ్యారు. అభ్యర్థులను తనిఖీ చేసి.. లోపలికి అనుమతించారు. కేంద్రం వద్ద ఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ అమలుచేశారు. అభ్యర్థులు సకాలంలో చేరుకునేలా, రవాణా ఇతరత్రా ఇబ్బందుల్లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.



పట్టాలు సృష్టించారు.. పరిహారం నొక్కేస్తారు?

- ఎంఎస్ఎంఈ పార్కు భూములపై వివాదం
- విభజన చేశాకే సేకరించాలని డిమాండ్

– న్యూస్‌టుడే– గరివిడి

గరివిడి మండలం కాపుశంభాం, బి.జి.పాలెం రెవెన్యూ గ్రామాల పరిధిలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు సేకరించ తలపెట్టిన డీపట్టా భూములపై వివాదం నెలకొంది. ఈ పార్కు కోసం మొత్తం 26.02 ఎకరాల డీపట్టా భూములను 11 మంది పట్టాదారుల నుంచి సేకరించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ఎకరాకు సుమారు రూ.26 లక్షలు చొప్పున పరిహారంతోపాటు భూముల్లోని చెట్లు, వ్యవసాయ బోర్లు, షెడ్ల విలువ ఆధారంగా లెక్కకట్టి అదనంగా పరిహారం చెల్లించాక స్వాధీనం చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే వివాదం తెరపైకి వచ్చింది.


తహసీల్దారుతో మాట్లాడుతున్న పట్టాదారులు

ఆన్‌లైన్ చేయలేదు.. పార్కు భూసేకరణ ప్రక్రియను పరిశీలించేందుకు చీపురుపల్లి ఆర్డీవో సుధారాణి, గరివిడి తహసీల్దారు బంగార్రాజు ఇటీవల క్షేత్రస్థాయికి వెళ్లగా.. పలువురు డీపట్టాదారులు అభ్యంతరాలు తెలిపారు. 'సర్వే నంబరు-1 పరిధిలో సుమారు 50 ఎకరాలకు పైగానే ప్రభుత్వ భూములున్నాయి. వీటిలో సుమారు 30 ఎకరాల వరకు కాపుశంభాం గ్రామానికి చెందిన 70 మంది నిరుపేద ఎస్సీ, బీసీలకు 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డీపట్టాలిచ్చారు. వాటిపై పట్టాదారు పాసుపుస్తకాలను జారీచేశారు. కానీ ఆ భూములను సబ్‌డివిజన్ చేసి హద్దులు చూపలేదు. పట్టాదారుల పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించి వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయలేదు. దీంతో అంతా ఉమ్మడిగా సాగు చేసుకుని ఫలసాయం అనుభవిస్తున్నాం' అని రెవెన్యూ అధికారులకు వివరించారు.

రాజకీయ పలుకుబడితో.. సర్వే నంబరు-1లో తమకు కేటాయించిన భూములు ఏవో గుర్తించి.. విభజన చేసి, వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసిన తర్వాతే పార్కుకు భూసేకరణ చేపట్టాలని పట్టాదారులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి డీపట్టాలు సృష్టించుకున్నవారు.. డీపట్టా భూములు అనధికారికంగా కొనుగోలు చేసుకున్నవారు రాజకీయ పలుకుబడితో ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోగా.. వాటిని అధికారులు సేకరిస్తున్నారని ఆరోపించారు.

చర్యలు తీసుకుంటాం: రికార్డులు పరిశీలించిన తర్వాతే భూములను సేకరిస్తున్నాం. సర్వే నం1లో 1977లో కొందరికి డీపట్టాలివ్వగా.. వారెవరూ భూముల్లో లేకపోవడంతో మళ్లీ 2005లో కొందరికిచ్చారు. వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాలేదు. ఈ సమస్య ఉన్న భూములను సేకరించడం లేదు. వారి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - **సీహెచ్ బంగార్రాజు, తహసీల్దారు**

గచ్చులు ఊడుతున్నాయ్.. పిల్లర్లు ఊగుతున్నాయ్


ఊడిపోతున్న గచ్చులు


కూలేలా తరగతి భవనం

గంట్యాడ మండలం వసంత జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ పాఠశాలలో గతంలో ఏర్పాటుచేసిన మరుగుదొడ్ల చాలావరకు శిథిలావస్థకు చేరాయి. విద్యార్థులు ఆరుబయటకు వెళ్తున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. కూలేలా ప్రమాదకరంగా ఉంది. మరమ్మతులు చేపట్టినా.. ఫలితం లేదు. గచ్చులు ఊడిపోతున్నాయి. ఎక్కడ బోల్తాపడతామోనని విద్యార్థులు భయపడుతున్నారు. వీడియో పాఠాలు బోధించేందుకు ఏర్పాటుచేసిన ప్రొజెక్టర్, ఏసీ మరమ్మతులకు గురై మూలకుచేరాయి. సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా.. ఫలితం లేదని చిన్నారుల తల్లిదండ్రులు, స్థానికులు వాపోతున్నారు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సింహాచలంను వివరణకోరగా.. ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. – న్యూస్‌టుడే, పెదమజ్జిపాలెం (గంట్యాడ గ్రామీణం)

మట్టిదారిలో కష్టాల ప్రయాణం



విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో నేటికీ పలుచోట్ల మట్టిదారులే దర్శనమిస్తున్నాయి. శివారు ప్రాంతాలు, విలీన పంచాయతీల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. వైకాపా హయాంలో సరిగా పట్టించుకోలేదు. కామాక్షినగర్- ఆనంద్‌నగర్ దారిలో మట్టిరోడ్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడితే రాకపోకలు సాగించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని కమిషనరు బాలస్వామి తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ప్రీమియం రూ.27.. పరిహారం రూ.6 వేలు

జీవాలకు బీమా.. పోషకులకు ధీమా

న్యూస్‌టుడే– గరివిడి

గొర్రెలు, మేకల పెంపకంతో జీవనాధారం పొందుతున్న కుటుంబాలు జిల్లాలో వేల సంఖ్యలో ఉన్నాయి. వ్యవసాయానికి అనుబంధంగా వీటిని పెంచుకునే రైతులు అనేక మంది ఉన్నారు. ప్రమాదాలు, అనారోగ్య కారణాలతో జీవాలు చనిపోతే పెంపకందారులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. దీని నుంచి ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా సదుపాయం కల్పించాయి. పోషకులంతా ఈ పథకాన్ని వినియోగించుకుని బీమా పొందాలని పశు సంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు.

రూ.9 లక్షల బడ్జెట్ కేటాయింపు

కుక్కల దాడులు, రోగాలు, ఇతరత్రా ప్రమాదాల బారినపడి గొర్రెలు, మేకలు మృతి చెందినప్పుడు పెంపకందారులు నష్టపోతుంటారు. ఇలాంటి సందర్భాల్లో ఆదుకునేలా జీవాలకు బీమా పథకం కోసం 2026- 27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాకు రూ.9 లక్షలు బడ్జెట్‌ను కేటాయించాయి. ఒక జీవానికి (గొర్రె లేదా మేక) మొత్తం ప్రీమియం రూ.180 కాగా.. అందులో ప్రభుత్వం రూ.153 భరిస్తుంది. పెంపకందారు కేవలం రూ.27 చెల్లిస్తే సరిపోతుంది. జిల్లాకు ఈ ఏడాది కేటాయించిన బడ్జెట్ ప్రకారం మొత్తం 5,882 జీవులకు బీమా చేసేందుకు అవకాశముంది. ఈ మేరకు మండలాల వారీగా లక్ష్యాలను నిర్ధారించినట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. బీమా చేసిన మేక లేదా గొర్రె ఏ కారణంతో మృతిచెందినా రూ.6 వేలు వరకు బీమా పరిహారం పొందవచ్చు.

అవగాహన కల్పిస్తున్నాం..

ప్రభుత్వం ఇచ్చిన బడ్జెట్ మేరకు మండలాల వారీగా ఎన్ని జీవాలకు బీమా చేయించాలన్నది పశువైద్యాధికారులకు ఇప్పటికే తెలియజేశాం. పెంపకందారులకు బీమా అవసరం, ప్రయోజనాలను వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నాం. పోషకులు స్వర్ణ గ్రామ కార్యాలయాల్లోని వెటర్నరీ సహాయకులు లేదా మండల పశువైద్యాధికారులను సంప్రదించాలి. ఇందుకు గడువు ప్రత్యేకంగా లేదు. కానీ త్వరగా ప్రీమియం వాటాను చెల్లించాలి.

– శివ్వాల మన్మథరావు, జేడీ, పశుసంవర్ధక శాఖ, విజయనగరం

జిల్లాలోని వివరాలు..

- ★ గొర్రెలు : 4,87,232
- ★ మేకలు : 1,70,613

కలల కొలువు.. సాధించిన గురువు

- ★ డిగ్రీ అధ్యాపకుడిగా మన్యం జిల్లావాసి
- ★ ఇటీవల మెగా డీఎస్సీలోనూ మూడు ఉద్యోగాలకు ఎంపిక



విజయనగరం విద్యావిభాగం, బలిజిపేట, న్యూస్‌టుడే: డిగ్రీ అధ్యాపక ఉద్యోగ పరీక్షలో తెలుగు ఉపాధ్యాయుడు **సారిపల్లి నాగరాజు** సత్తాచాటారు. అనంతపురం జిల్లా రాయదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఇతనిది పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం పెదపెంకి గ్రామం. ప్రస్తుతం నెల్లిమర్ల మండలం పారసాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో తెలుగు సహాయకుడిగా పనిచేస్తున్నారు. 2023లో వెలువడిన ప్రకటన ద్వారా డిగ్రీ అధ్యాపక పోస్టులకు పోటీపడి ఉద్యోగాన్ని సాధించారు. ఇటీవల మెగా డీఎస్సీలో పాఠశాల సహాయకుడు, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు కైవసం చేసుకున్నారు. పెదపెంకి గ్రామంలో 1 నుంచి 10వ తరగతి వరకు.. ఇంటర్, డిగ్రీ ప్రకాశం జిల్లా తిమ్మసముద్రంలో చదివారు. రాజమహేంద్రవరంలో తెలుగు పండిట్ శిక్షణ పొందారు. హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయంలో 'చింతా అప్పలనాయుడు కథలు, పరిశీలన'పై ఎంఫిల్, 'అర్ధశతాబ్ది ఉత్తరాంధ్ర గిరిజన కథలు, పరిశీలన'పై పీహెచ్‌డీ చేశారు.

రచయితగా పేరు..

రచయితగా నాగరాజుకు పేరుంది. సుమారు 50 వ్యాసాలు, మూడు కథలు రాశారు. కొవిడ్ సమయంలో వేదికగా మారిన ఫేస్‌బుక్‌పై.. ఉత్తరాంధ్రకు చెందిన పలువురు రచయితలు, కథకుల మీద వ్యాసాలు రాశారు. అరసంలో ప్రస్తుతం విజయనగరం జిల్లా సంయుక్త కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గతంలో మన్యం జిల్లా శాఖలోనూ బాధ్యతలు నిర్వహించారు. ఎంపికపై అరసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.ఎస్.చలం, రత్నాల బాలకృష్ణ, ఇతర సాహితీ సంస్థల సభ్యులు అభినందనలు తెలిపారు.

స్వచ్ఛతలో మేటి.. పంచాయతీలకు పోటీ

న్యూస్‌టుడే– రాజాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ పంచాయతీలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రి కావడంతో పల్లెల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్నారు. గతంలో ఉపాధిహామీ పథకం కింద రహదారులు, కాలువలకు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం స్వచ్ఛతలో మేటిగా ఉండే పంచాయతీలకు పురస్కారాలు ఇవ్వాలని నిర్ణయించారు.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో 'స్వచ్ఛాంధ్ర అవార్డులు- 2026' పేరుతో పోటీ నిర్వహిస్తున్నారు. విజయనగరం జిల్లాలో 777.. పార్వతీపురం మన్యం జిల్లాలో 451 పంచాయతీల్లో ఇది కొనసాగుతుంది. ఈ మేరకు ఆదేశాలు అందాయి. అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా పురస్కారాలను అందిస్తారు.


రాజాం: పాగిరిలో స్వచ్ఛ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులు

స్వచ్ఛాంధ్ర- 2026 పురస్కారాలు

స్వచ్ఛ గ్రామ పంచాయతీకి ప్రామాణికం ఇవీ..

అంశం	మార్కులు
ఇంటింట చెత్తసేకరణ	30
తడి, పొడి చెత్తసేకరణ	25
ఘన వ్యర్థాల నిర్వహణ	20
పరిసరాల పరిశుభ్రత	15
గృహ కంపోస్టింగ్, కిచెన్ గార్డెన్	10

క్షేత్రస్థాయిలో మెరుగ్గా ఉంటేనే.. పురస్కారాల కోసం తిమ్మిని బమ్మిని చేస్తామంటే కుదరదు. క్షేత్రస్థాయిలో అన్నీ బాగుంటేనే అవార్డుకు ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్‌లో పంచాయతీ కార్యదర్శులు వివరాలను ఈనెల 31లోగా నింపి పంపాలి. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 8 వరకు జిల్లాస్థాయి బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి.. వాస్తవ పరిస్థితిని తెలుసుకుంటాయి. వాటికి అనుగుణంగా ఫలితాలను ప్రకటిస్తారు.

వంద మార్కులకు..

రాష్ట్ర, జిల్లాస్థాయిలో కలిపి 11 పురస్కారాలు అందించనున్నారు. జిల్లాస్థాయిలో అయిదు, రాష్ట్ర స్థాయిలో ఆరు ఇవ్వాలని నిర్ణయించారు. స్వచ్ఛ గ్రామ పంచాయతీల విభాగంలో వీటిని అందిస్తారు. వంద మార్కులకు పోటీ ఉంటుంది. ఇందులో ఎక్కువ మార్కులు సాధించిన పంచాయతీకి అవార్డు దక్కుతుంది. పారిశుద్ధ్య కార్మికులకు కూడా పురస్కారాలు ఇవ్వనున్నారు. వీరికి జిల్లాస్థాయిలో అయిదు, రాష్ట్రస్థాయిలో మూడు ఇస్తారు. వీరికి వంద మార్కులకు పోటీ ఉంటుంది. వ్యర్థాల విభజన, స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించడం, ఇంటింటా చెత్త సేకరణ, విధుల పట్ల ఉన్న శ్రద్ధ, నిర్వహణ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.

సద్వినియోగం చేసుకోవాలి..

పలు విభాగాల్లో పురస్కారాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్వీయ నమోదుకు అవకాశం కల్పించింది. ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఈ పురస్కారాలను గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు రెండో తేదీన రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రదానం చేస్తారు.

– డీవీ మల్లికార్జునరావు, డీపీవో

శాస్త్రోక్తంగా కుంకుమ పూజలు



కొత్తవలస, న్యూస్‌టుడే: వీరభద్రపురంలోని సర్వమంగళ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు కావలి రవికుమార్‌శర్మ శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. రాష్ట్ర దాసరి కార్పొరేషన్ ఛైర్మన్ పి.వి.రత్నాజీ పాల్గొన్నారు.

పోటీతత్వం పెంపొందించడమే లక్ష్యం

విజయనగరం బాబామెట్ట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని డీఈవో యు.మాణిక్యంనాయుడు అన్నారు. జిల్లాలో క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన పాఠశాలకు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులను ఆదివారం అందజేశారు. ఆరికతోట, తూడెం జడ్పీ ఉన్నత, ఎంఆర్ సాంస్కృతిక పాఠశాల, బాడంగి అంబేడ్కర్ గురుకులం, తొండ్రంగి ఉన్నత పాఠశాల మొదటి అయిదు స్థానాల్లో నిలిచాయి. హెచ్ఎంలు, పీడీలకు అవార్డులను అందజేశారు. పాఠశాలల క్రీడల కార్యదర్శులు కె.గోపాలరావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు యువకులను రక్షించిన లైఫ్‌గార్డులు

తప్పిన పెను ప్రమాదం


కాపాడిన యువకులతో లైఫ్‌గార్డులు, మెరైన్ పోలీసులు

విశాఖపట్నం(సాగర్‌నగర్), న్యూస్‌టుడే: విశాఖపట్నం రుషికొండ తీరంలో ఆదివారం సముద్ర స్నానాలకని దిగిన ఏడుగురు యువకులు కొట్టుకుపోతుండగా జీవీఎంసీ, టూరిజం బ్లూఫ్లాగ్ బీచ్ లైఫ్‌గార్డులు వారిని రక్షించారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ (రాయపుర్)కు చెందిన రాజేంద్రసత్య, మనోజ్‌తండిల్‌వాల్, కిశోర్‌కుమార్‌ఠాకుర్, తరుణ్‌వర్మ, పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన టి.మురళీ, జి.శ్రీరామ్‌కుమార్, ఆర్.తేజేశ్వరరావు విహారయాత్రలో భాగంగా రుషికొండ తీరానికి వచ్చారు. ఈ క్రమంలో స్నానాల కోసం సముద్రంలో దిగారు. అలల ఉద్ధృతి అధికంగా ఉండటంతో కొట్టుకుపోతున్న వీరిని లైఫ్‌గార్డులు గుర్తించి మెరైన్ పోలీసుల సహకారంతో సకాలంలో ఒడ్డుకు చేర్చారు. ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మెరైన్ సీఐ అప్పారావు, ఎస్సై మనోజ్‌కుమార్ సూచనల మేరకు ఏఎస్సై శ్రీనివాసరావు సమక్షంలో యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించి పంపించారు.

★ సందర్శకులు సముద్ర స్నానాలు చేసే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రీయ లైఫ్ సేవింగ్ సొసైటీ (ఆర్ఎల్ఎస్ఎస్), వాటర్‌స్పోర్ట్స్ అధ్యక్షుడు బి.బలరామ్ నాయుడు పేర్కొన్నారు. తీరప్రాంతాల్లో ఎంతోమంది ప్రాణాలు కాపాడుతున్న లైఫ్‌గార్డుల సేవలను కొనియాడారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని జూనియర్ లైన్‌మెన్ మృతి


చుక్క సంతోష్ (పాతచిత్రం)

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని కొత్త రోడ్డు సమీపంలో ఆదివారం ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చుక్క సంతోష్ (36) హడ్కో కాలనీలో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కొత్తరోడ్డు వైపు నుంచి శ్రీకాకుళం బస్టాండ్‌కు బస్సు వస్తుండగా, అదే సమయంలో సంతోష్ రోడ్డు దాటుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయన స్వస్థలం పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం చిన్ని గ్రామం. గత ఆరేళ్లుగా శ్రీకాకుళంలోనే కుటుంబంతో నివాసముంటున్నాడు. భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీకాకుళం గ్రామీణ ఎస్సై కె.సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సర్వజనాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి వృద్ధుడి దుర్మరణం

కావలి, న్యూస్‌టుడే: రైలు ఎక్కబోతూ అదుపు తప్పి పట్టాలపై పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో ఆదివారం చోటుచేసుకుంది. జీఆర్‌పీ ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాల మేరకు.. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన పి.ఈశ్వరరాజు (70) అనే వృద్ధుడు పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన ఓ యజమాని వద్ద పనిచేస్తున్నాడు. ఆ యజమానికి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి మండలంలో పొలాలు ఉన్నాయి. అక్కడ ఈశ్వరరాజు సహాయకుడిగా ఉన్నాడు. ఈ క్రమంలో భీమవరానికి వెళ్లేందుకు ధర్మవరం- నరసాపురం ఎక్స్‌ప్రెస్ రైలుకు రిజర్వేషన్ చేయించుకున్నాడు. స్టేషన్‌కు ఆయన ఆలస్యంగా చేరుకోవడంతో కదులుతున్న రైలును ఎక్కే ప్రయత్నం చేయగా అదుపుతప్పి పట్టాలపై పడిపోయాడు. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్సై చెప్పారు.

పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

కొత్తవలస, జామి, న్యూస్‌టుడే: కంటకాపల్లి- అలమండ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం గుర్తించామని విజయనగరం రైల్వే పోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. సుమారు 60 నుంచి 65 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని.. తల, నడుముకు ఎడమ వైపు బలమైన గాయాలు ఉన్నాయన్నారు. సుమారు 5.6 అడుగుల ఎత్తు ఉంటాడని.. ఎరుపు రంగు కట్ బనియన్ వేసుకొని, నడుముకు తెలుపు, నీలం, నలుపు గడులున్న షర్ట్ చుట్టుకొని ఉన్నాడని పేర్కొన్నారు. కేసు నమోదుచేసి, మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రి శవాగారానికి తరలించామని చెప్పారు. ఇతని ఆచూకీ తెలిసినవారు 92475 85742, 94401 70317 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యుదాఘాతంతో చోదకుడికి తీవ్ర గాయాలు

బలిజిపేట, పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు విద్యుత్తు తీగలు తగిలి డ్రైవరు తీవ్ర గాయాలపాలైన ఘటన బలిజిపేట మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. అరసాడ గ్రామానికి చెందిన గుల్ల రాజు కుమార్తె వివాహానికి ఓ ప్రైవేటు బస్సును ఏర్పాటు చేసుకున్నారు. ఈ బస్సు గ్రామానికి వస్తుండగా బస్టాండు సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో పైనున్న విద్యుత్తు తీగలు తగిలాయి. గుర్తించిన క్లీనరు ముందే కిందకు గెంతేశాడు. గరుగుబిల్లికి చెందిన చోదకుడు జి.సురేష్ విద్యుత్తు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖకు తరలించారు. బస్సులో వీరిద్దరు మినహా ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

చికెన్ ధరలు

రకం (కిలో రూ.ల్లో..)	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

కోటిపాంలో కరిరాజులు



కొమరాడ, న్యూస్‌టుడే: కొమరాడ మండలం కోటిపాం పరిసర ప్రాంతాల్లో కరిరాజులు సంచరిస్తున్నాయి. వరి దుబ్బుకడుతున్న సమయంలో అడవి ఏనుగులు పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాలు లేక పంటలు పండడంలేదని.. దీనికితోడు గజరాజులు పంటలను నాశనం చేస్తున్నాయని రైతన్నలు విలపిస్తున్నారు. వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

నేడు ఐటీడీఏలో పీజీఆర్ఎస్.. సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు కార్యాలయం సిబ్బంది ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు హాజరై తమ వ్యక్తిగత, గ్రామ సమస్యలపై వినతులు అందించవచ్చన్నారు.

అడ్డుగోడ తొలగింది

పుర షాపింగ్ కాంప్లెక్స్‌కు మోక్షం

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వసతుల్లేవనే కారణంతో పక్కనే ఉన్న మున్సిపాలిటీకి చెందిన స్థలంలో కొత్తగా మరో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించారు. అప్పట్లో వైకాపా మంత్రులు దీన్ని ప్రారంభించారు. వసతులు దేవుడెరుగు.. కనీసం పూర్వ కాంప్లెక్స్‌లోకి జనం రాకుండా మధ్యలో భారీగోడ నిర్మించారు. అప్పట్లో ఇన్, అవుట్‌గా ఉన్న గేట్లను కాదని.. ఒకే గేటుకు పరిమితం చేశారు. దీంతో అంత వరకు ఒక వెలుగు వెలిగిన పురపాలిక వాణిజ్య సముదాయాలు జనం లేక వెలవెలబోవడం మొదలయ్యాయి. ఒక్కో దుకాణాన్ని వ్యాపారులు ఖాళీ చేసి పురపాలికకు తాళాలు అప్పగించేశారు. దీంతో ఏటా రూ.30 లక్షల వరకు ఆదాయానికి గండి పడుతూ వచ్చింది. దీనికితోడు కాంప్లెక్స్ మొత్తం దుర్గంధంగా మారింది. ప్రైవేటు వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారిపోయింది. వైకాపా హయాంలో చేసిన తప్పిదాన్ని ఎట్టకేలకు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సరిచేయించారు. ఏళ్లుగా నలుగుతున్న సమస్యను కొలిక్కి తెచ్చారు. ఈనెల 28న చొరవ తీసుకుని గోడను తొలగింపజేశారు.

స్థానికుల్లో హర్షం.. పాత కాంప్లెక్స్ ప్రాంగణంలోనే నవదుర్గ, జ్ఞాన సరస్వతి అమ్మవార్ల ఆలయాలు ఉన్నాయి. చాలామంది అమ్మవార్లను దర్శించుకుని బస్సులో ప్రయాణించేవారు. గోడ కట్టడం వల్ల ఆలయాలకు వచ్చే వారి సంఖ్య తగ్గిపోయింది. గోడను తొలగించాలని ప్రజలు అనేకసార్లు వినతులు ఇచ్చారు. స్వయంగా ఎమ్మెల్యే కూడా ఆర్టీసీ ఉన్నతాధికారులను కోరారు. ఎట్టకేలకు తొలగింపజేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై విలువైన పురపాలిక కాంప్లెక్స్‌లు వినియోగంలోకి వస్తాయని ఆశిస్తున్నారు.


అడ్డుగోడ తొలగించిన తర్వాత ఇలా..

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన సీనియర్ జట్టు

బొబ్బిలి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న జిల్లా జట్లను బొబ్బిలి సమీప పారాది జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంపిక చేశారు. సాఫ్ట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బేబినాయన సూచనలతో సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ స్థాయిలో ఎంపిక పోటీలు జరిపారు. ఎల్.కోట, భోగాపురం, ఆరికతోట, తోటపల్లి, బొడ్డవర, పెరుమాళి, బాడంగి, రామభద్రపురంతో పాటు పలు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీలు బొబ్బిలిలో, జూనియర్స్, సీనియర్స్ పోటీలు కడపలో అక్టోబరులో నిర్వహించనున్నారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరమేష్, కార్యదర్శి విజయకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, పీడీలు సత్యనారాయణ, వెంకటనాయుడు, శివ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో హుండీల చోరీ

వేపాడ, న్యూస్‌టుడే: వేపాడ మండలం కొండగంగుబూడి పంచాయతీలో బంగారమ్మ, రామాలయంలోని హుండీలు వరుసగా చోరీకి గురయ్యాయి. దీంతో వల్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో స్థానికులు ఆదివారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 8 గంటల వరకు స్థానికులు రామాలయంలో భజనలు చేసి.. ఇళ్లకు వెళ్లారు. తిరిగి వచ్చి చూసేసరికి హుండీ తాళం విరగ్గొట్టి ఉంది. కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బంగారమ్మ ఆలయంలో ఈనెల 27న గేటు తాళాలు విరగ్గొట్టి హుండీ పగులగొట్టి కాజేశారు. దీంతో స్థానికులు ఈ రెండు ఘటనలపై ఫిర్యాదు చేశారు. ఎస్సై సుదర్శన్ కేసు నమోదు చేసి.. విజయనగరం నుంచి క్లూస్‌టీంను రప్పించి దర్యాప్తు చేపట్టారు.

బొబ్బిలి

● బొబ్బిలి ● రాజాం ● గజపతినగరం ● చీపురుపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? రాజాం పట్టణంలోని జి.ఎం.ఆర్ నగర్‌లో మునకలవలస వెళ్లే రహదారి పక్కన చెత్తను పారబోస్తున్నారు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం.– స్థానికులు ●: చెత్తను తొలగించి పరిష్కరిస్తాం. – ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, రాజాం పట్టణం

? రామభద్రపురం మండలం మర్రివలసలోని వీధి కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో మురుగు ముందుకు ప్రవహించడం లేదు. దుర్వాసనతో పాటు దోమలు విజృంభించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. – స్థానికులు ●: పూడికలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. -వెంకటరమణ, డిప్యూటీ ఎంపీడీవో – న్యూస్‌టుడే, రామభద్రపురం

? పెదమజ్జిపాలెం ఎస్సీ కాలనీలో కాలువలు పూడుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. – స్థానికులు ●: మురుగు తొలగిస్తాం. - విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో, – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

తాగునీటి బోరు ఏర్పాటు

స్పందనకు వందనం

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: బుడతనాపల్లి నాయుడుచెరువు వీధిలో ఎట్టకేలకు అధికారులు తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. ఆ వీధిలో ఎటువంటి తాగునీటి పథకాలు లేకపోవడంతో పదేళ్లుగా స్థానికులు పడుతున్న అవస్థలపై 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికతో పలుమార్లు ప్రచురించిన వార్తకు అధికారులు, పాలకులు స్పందించి బోరు ఏర్పాటు చేయించారు.

4న అమ్మవారికి నిమ్మకాయలతో అలంకరణ

చీపురుపల్లి, న్యూస్‌టుడే: శ్రావణ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా సెప్టెంబరు 4న చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారిని నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు దేవస్థానం అర్చకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి అలంకరించేందుకు నిమ్మకాయలు సమర్పించాలనుకున్న భక్తులు 3వ తేదీ ఉదయం 9 గంటల్లోగా దేవస్థానంలో అందజేయాలని కోరారు.

తెరపై ఈనాడు

బొబ్బిలిలో.. ● లక్ష్మి: ఇరుముడి ● వాసవి: విశ్వనాథ్ అండ్ సన్స్ ● టీబీఆర్ (స్క్రీన్-1): టాక్సిక్ ● టీబీఆర్ (స్క్రీన్-2): టాక్సిక్ – న్యూస్‌టుడే, బొబ్బిలి

రాజాంలో.. ● ఎస్‌వీసీ సీతారామ: ఇరుముడి ● ఎస్‌వీసీ సీతారామ మినీ: విశ్వనాథ్ అండ్ సన్స్ ● ఎస్‌వీసీ అప్సర: టాక్సిక్ – న్యూస్‌టుడే, రాజాం

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో ఆదివారం కూరగాయల ధరలు (కి.లో రూ.లలో) ● టమాటా: 32 ● వంకాయలు: 30 ● దొండ: 38 ● బీర: 40 ● బెండ: 30 ● కాకర: 40 ● చిక్కుడు: 32 ● ఆనపకాయ (ఒకటి): 20 ● అరటి (జత): 20 ● మునగ: 50 ● ఉల్లి: 60 ● బంగాళదుంపలు: 20 ● అల్లం: 115/170 ● వెల్లుల్లి: 60 ● పచ్చిమిర్చి: 60 ● క్యాబేజీ: 45 ● క్యారెట్: 45 ముల్లంగి: 60 – న్యూస్‌టుడే, రాజాం

విస్తరణకు నోచుకోక.. అవస్థలు తీరక

సంతకవిటి, న్యూస్‌టుడే: ఏళ్లుగా రహదారులు విస్తరణకు నోచుకోకపోవడంతో వాహన చోదకులు, ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్లు వెడల్పు చేయకపోవడంతో ప్రజా రవాణాపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇరుకైన రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఇదీ సంతకవిటి మండలంలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారుల దుస్థితి.



సంతకవిటి - పొందూరు ఆర్‌అండ్‌బీ రహదారిలో నిలిచిన వాహనాలు

రెండు లైన్ల రహదారి నిర్మించేందుకు..

దశాబ్దాల క్రితం నిర్మించిన సంతకవిటి - రాజాం ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారి 14 కి.మీ.పొడవున ఉంది. 2013లో ఈ రహదారిని రెండు లైన్లుగా మార్చేందుకు అప్పటి ప్రభుత్వం రూ.14కోట్ల నిధులు మంజూరు చేసింది. రహదారి పనులు దక్కించుకునే విషయంలో గుత్తేదారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో నేటికీ విస్తరణ పనులకు నోచుకోలేదు. తాలాడ, బొద్దూరు, పొనుగుటివలస గ్రామాల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు తప్పుకునేందుకు వీలు లేకపోవడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. విషయంపై ర.భశాఖ ఏఈ ఆంజనేయనాయకర్ వద్ద ప్రస్తావించగా ఈ రహదారిని రెండులైన్ల రహదారిగా మార్చేందుకు రూ.25 కోట్లతో ప్రతిపాదన పంపించాం. నిధులు మంజూరవగానే పనులు చేపడతామని తెలిపారు.

నిధులు మంజూరైనా..

సంతకవిటి - పొందూరు ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారి 17 కి.మీ.పొడవున ఉంది. 70 ఏళ్ల కిందట నిర్మించిన ఈ రహదారి నేటికీ విస్తరణకు నోచుకోలేదు. 2022లో ఈ రహదారిని రెండు లైన్లుగా మార్చేందుకు ప్రభుత్వం రూ.22 కోట్లు నిధులు మంజూరు చేసింది. అప్పట్లో వైకాపా ప్రభుత్వం పనులు చేపట్టేందుకు సుముఖత చూపకపోవటం, గుత్తేదారులు ముందుకు రాకపోవటంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. మందరాడ, కాకరపల్లి, చింతలపేట, అప్పలఅగ్రహారం, సిరిపురం గ్రామాల సమీపంలో ఇరుకైన రహదారి కావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పుకునేందుకు వీలులేకుండా పోయింది. మిర్తివలస, మల్లయ్యపేట, శేషాద్రిపురం వద్ద ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. దీంతో ఈ రహదారిలో తరచూ ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రహదారి విస్తరణ పనులు చేపడితే ప్రమాదాల నియంత్రణకు అవకాశముంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. విషయంపై ర.భశాఖ ఏఈ పీటీ రాజు వద్ద ప్రస్తావించగా సంతకవిటి - పొందూరు ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారిని రెండు లైన్లు రహదారిగా మార్చేందుకు రూ.50 కోట్లతో ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

జివాన్‌జీ కోనేరుకు మంచి రోజులు



యంత్రాలతో తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

గంట్యాడ, న్యూస్‌టుడే: దశాబ్దాల చరిత్ర ఉన్న గంట్యాడ శివాలయం సమీపంలోని జివాన్‌జీ కోనేరుకు మంచిరోజులు రానున్నాయి. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ చెరువును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సంకల్పించారు. కోనేరు గట్టును అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కోనేరు గట్టు చుట్టూ కంచె, ఒడ్డు నడకకు వీలుగా వాకింగ్ ట్రాక్, ఓపెన్ థియేటర్, పార్క్ జిమ్, గ్రంథాలయం కోసం రెండంతస్తుల భవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశారు. రెండు రోజుల నుంచి కోనేరు చుట్టూ ఉన్న ముళ్ల పొదలను యంత్రాల సహాయంతో తొలగిస్తున్నారు. గట్టు చదును చేసి అంచనాలు రూపొందించనున్నట్లు పీఆర్ ఏఈ కృష్ణమూర్తి తెలిపారు.

వాహనం బోల్తా: తప్పిన ప్రమాదం



పొలంలోకి దూసుకెళ్లిన వ్యాను

వంగర, న్యూస్‌టుడే: వంగర మండలం శ్రీహరిపురం నుంచి రాజాం వెళ్తున్న ఓ వ్యాన్ అదుపు తప్పి శ్రీహరిపురం గ్రామ సమీపంలో ఆదివారం అదుపుతప్పింది. పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఆ సమయంలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

దుమ్ము రేగుతోంది.. ప్రాణం పోతోంది

గరివిడి రైల్వే వంతెన కింద ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్డులో దుమ్ము, ధూళి రేగి ఇళ్లు, దుకాణాల్లోకి చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గరివిడి నుంచి గర్భాం వెళ్లే వాహనాలతో పాటు మెరకముడిదాం మండలంలోని ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలు సైతం ఈ సర్వీసు రోడ్ల నుంచే నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. సమస్యను ఆర్‌అండ్‌బీ ఏఈ జార్జివెస్లీ వద్ద ప్రస్తావించగా సర్వీసు రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామన్నారు. – న్యూస్‌టుడే, గరివిడి



వీధుల్లోకి రావాలంటే భయంభయం



రాజాం మండలంలో మొగిలివలసలో కుక్కల బెడద అధికంగా ఉంది. గ్రామంలో వీటి సంచారం పెరగడంతో నెలరోజుల్లో 18 మంది కుక్కకాటుకు గురయ్యారు. దీంతో చిన్నారులు, వృద్ధులు వీధుల్లో తిరిగేందుకు భయాందోళన చెందుతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందన కరవైందని పలువురు ఆవేదన చెందుతున్నారు. విషయంపై రాజాం ఎంపీడీవో ఆనందరావు వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

మలుపులు..ప్రమాదాలకు పిలుపులు



రాజాం పట్టణం నుంచి బుచ్చెంపేట మీదుగా గడ్డిముడిదాం, దోసరి, అమరాం గ్రామాలకు వెళ్లే రహదారి పలు చోట్ల మలుపులతో ప్రమాదకరంగా ఉంది. ఈ మలుపుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ నాగభూషణం వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

కానరాని కాలువ.. వీడని మురుగు

దత్తిరాజేరు మండలంలోని రాజుల రామచంద్రపురం ప్రధాన వీధిలో కాలువలు లేక స్థానికులు నిత్యం మురుగుతో అవస్థలు పడుతున్నారు. ఇళ్లలోని వాడుక నీరు రహదారి పక్కన నిల్వ ఉంటోంది. దోమలు, దుర్వాసనతో జ్వరాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. మురుగు తొలగించేందుకు స్వర్ణగ్రామ సిబ్బంది చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. సమస్యను ఎంపీడీవో ఎస్.తాత వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా కార్యదర్శితో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. – న్యూస్‌టుడే, దత్తిరాజేరు



దిష్టి బొమ్మల్లా తాగునీటి కుళాయిలు



పెదమజ్జిపాలెం (గంట్యాడ గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని ఆర్.వసంత గ్రామస్థులకు తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన కుళాయిలకు నీటి సరఫరా జరగక దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. పైపులైన్లు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా బాగు చేయడం లేదని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సమస్యను స్వర్ణగ్రామ కార్యదర్శి సూర్యనారాయణ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా తక్షణమే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపడతామన్నారు.

చెరకు రైతులను ఆదుకుంటాం

రాజాం, రాజాం గ్రామీణం, రేగిడి: చెరకు రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఆదివారం రాజాంలో ఏపీ రైతు సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి రైతుల సమస్యలను వివరించారు. రాయితీలు ఇస్తే చెరకు విస్తీర్ణం పెంచేందుకు వీలుంటుందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. 2027-28 సీజన్‌లో చెరకు గానుగ నిలిపేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించిందని, 5 లక్షల టన్నుల చెరకు ఉంటే తప్ప కర్మాగారం నడిచే పరిస్థితి లేదని చెబుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయశాఖ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, ప్రతినిధులు కింజరాపు సురేష్, సూర్యప్రకాష్, కోటేశ్వరరావు, కర్రి రమణ, కె. సతీష్, టి.తవిటినాయుడు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న ఏపీ రైతు సంఘం ప్రతినిధులు

అగ్నివీర్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

బొబ్బిలి, న్యూస్‌టుడే: విశాఖలో సెప్టెంబరు 3న ఆర్మీ అగ్నివీర్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనే వారికి పట్టణానికి చెందిన జాతీయ క్రీడాకారుడు రావు శ్రీనివాసరావు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. ర్యాలీలో పాటించాల్సిన పద్ధతులు, మెలకువలను అభ్యర్థులకు నేర్పిస్తున్నారు. హైజంప్, లాంగ్‌జంప్, అథ్లెటిక్స్ వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నారు. దీంతో చాలామంది యువత చేరి శిక్షణ తీసుకుంటున్నారు.



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న శ్రీనివాసరావు

'కార్మికులకు అన్యాయం'

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పారిశ్రామికవాడలోని నీటి సరఫరా విభాగంలో పనిచేసే కార్మికులకు ఏజెన్సీ తీవ్ర అన్యాయం చేస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శంకరావు ఆరోపించారు. కార్మికుడికి నెలకు రూ.25 వేలు డ్రా చేసిన గుత్తేదారు కార్మికులకు మాత్రం నెలకు రూ.8,500లు చెల్లిస్తున్నారని ఆరోపించారు. ఇందులో అధికారుల పాత్ర ఉందన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బొబ్బిలి, న్యూస్‌టుడే: మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు మాజీ సైనికుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు మరడ రామునాయుడు తెలిపారు. బొబ్బిలి పాతకోటలోని కార్యాలయంలో ఆదివారం నిర్వహించి ప్రభుత్వం నుంచి మాజీ సైనికులకు అందాల్సిన పథకాలు, భూ కేటాయింపులు, ఇతర సౌకర్యాల అమలు తీరుపై సమీక్ష జరిపారు. అధ్యక్షుడు రేవళ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

టెట్ రద్దు చేయాలి

చీపురుపల్లి, న్యూస్‌టుడే: ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు సంబంధించి టెట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 3న చలో విజయవాడ నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు ఆదివారం చీపురుపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23(1) సవరణకు కేంద్రవిద్యాశాఖపై రాష్ట్ర విద్యాశాఖ ఒత్తిడి తేవాలని కోరారు. జిల్లాలోని ఉపాధ్యాయులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



నిబంధనలు ఉల్లంఘిస్తే కేసుల నమోదు

రామభద్రపురం, న్యూస్‌టుడే: ఆటోల్లో ఎక్కువ మందిని ఎక్కించి ప్రయాణిస్తే కేసులు నమోదు చేస్తామని బొబ్బిలి రూరల్ సీఐ మల్లికార్జునరావు హెచ్చరించారు. రామభద్రపురం, తారాపురం రహదారుల్లో ఎస్సై జ్ఞానప్రసాద్‌తో కలిసి ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ఆటో చోదకులపై కేసులు నమోదు చేసి వారికి అవగాహన కల్పించారు. అధిక లోడు వల్ల వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జాతీయ రహదారిపై వాహనాలు నిలిపితే కేసులు నమోదు చేస్తామన్నారు.

పెరిగిన ధరలతో ఇబ్బందులు

రామభద్రపురం, న్యూస్‌టుడే: నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. రామభద్రపురం మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు.

తొలగిన ప్రమాదం

మెంటాడ, న్యూస్‌టుడే: మెంటాడ నుంచి గజపతినగరం వరకు ఉన్న రహదారిని తవ్వి రోలింగ్ సరిగా చేయకపోవడంతో వాహన చోదకులు ఇబ్బంది పడేవారు. దీనిపై స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. ర.భ.శాఖ ఏఈ అజయ్ భార్గవ్ స్పందించి చర్యలు చేపట్టారు.

కెల్లలో జిల్లాస్థాయి పోటీలు ప్రారంభం

గుర్ల, న్యూస్‌టుడే: క్రీడాదినోత్సవం సందర్భంగా మండలంలోని కెల్లలో భాస్కర్, రాకేష్ మెమోరియల్ జిల్లాస్థాయి ఖోఖో పోటీలు ఆదివారం ఉన్నత పాఠశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 25 మంది బాల బాలికల జట్లు పాల్గొన్నాయి. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, యువత పాల్గొన్నారు.



ఖోఖోలో తలపడుతున్న బాలికలు

తులం బంగారం, కిలో వెండి చోరీ

రామభద్రపురం, న్యూస్‌టుడే: బూసాయవలస గ్రామానికి చెందిన గంటా శ్రీనివాసరావు ఇంట్లో శనివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై జ్ఞానప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటికి తాళం వేసి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లారు. ఆదివారం ఉదయం పని మనిషి వెళ్లి చూసేసరికి తలుపులు తీసి ఉండటంతో యజమానికి సమాచారం ఇచ్చింది. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి ఇంటి వెనుక నుంచి తాళం విరగ్గొట్టి ఇంట్లో ఉన్న తులం బంగారు ఉంగరాలు, కిలో వెండి సామగ్రి ఎత్తుకెళ్లి పోయారని తెలిపారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బస్సులో ఉంచిన నగదు సంచి అప్పగింత

రాజాం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులోని నగదు సంచిని గుర్తించి మహిళకు తిరిగి పోలీసులు అప్పగించిన ఘటన రాజాంలో ఆదివారం చోటు చేసుకొంది. సీఐ డి.నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా బెలగాం గ్రామానికి చెందిన ఒ.జగ్గమ్మ రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శ్రీకాకుళం వెళ్లేందుకు బస్సులో రద్దీ ఉండటంతో తన చేతి బ్యాగును సీటులో వేశారు. ఇంతలోనే బస్సు కదిలిపోయింది. దీంతో రాజాం పోలీసులను ఆశ్రయించారు. కాంప్లెక్స్‌లోని సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా బస్సును గుర్తించారు. కండక్టర్‌కు సమాచారం ఇచ్చి ఆయన ద్వారా సంచిని రప్పించి బాధితురాలికి అప్పగించారు. అందులో రూ.4వేలు నగదు, ఆధార్‌కార్డు ఉన్నట్లు సీఐ తెలిపారు.

మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడి మృతి



ఆనందరావు (పాతచిత్రం)

రేగిడి, న్యూస్‌టుడే: మండలంలోని దేవుదళకు చెందిన మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు, మాజీ సర్పంచి కెంబూరు ఆనందరావు(77) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందారు. ఈయన పాలకొండ మాజీ ఎమ్మెల్యే కెంబూరు సూర్యనారాయణ కుమారుడు. 1985 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి చెందారు. ఈయన భార్య ఉమ దేవుదళ సర్పంచిగా పనిచేశారు. ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని గ్రామస్థుల సందర్శనార్థం సోమవారం దేవుదళ తీసుకువస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

మధురం.. భాగవతం

రాజాం, న్యూస్‌టుడే: మధురమైన ఇతిహాసం భాగవతమని సాహితీవేత్త పిల్లా తిరుపతిరావు పేర్కొన్నారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాహితీ సదస్సు నిర్వహించారు. 'పోతన భాగవతం- అలంకారిత' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. చక్కటి సాహిత్య పరిమళం, అలంకారాలతో భక్తి భావ పూరితంగా రచించడం వల్లే పోతన భాగవతానికి అంతటి కీర్తి, ప్రాచుర్యం వచ్చిందని చెప్పారు. వేదిక సభ్యులు తిరుపతిరావును ఘనంగా సత్కరించారు. నిర్వాహకులు గార రంగనాథం, ఒమ్మి రమణమూర్తి, రౌతు గణపతిరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిరావును సత్కరిస్తున్న వేదిక ప్రతినిధులు

ఓటర్ల జాబితాలు పక్కాగా ఉండాలి

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఓటుహక్కు కోసం 18 ఏళ్లు నిండిన వారంతా నమోదు చేసుకోవాలని గంట్యాడ మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసపాణి అన్నారు. మండలంలోని రామవరం, నీలావతి గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ఓటు నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. రామవరం గ్రామంలోని ఓటరు జాబితాలో నెలకొన్న పొరపాట్లను తక్షణమే సరి చేయాలని సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ సూర్యకాంతం, ఆర్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.



జాబితాను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసపాణి

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితాలు పక్కాగా ఉండాలని మండల ఎన్నికల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పాచలవలస, రాజుల రామచంద్రపురం, పి.లింగాలవలస గ్రామాల్లో ఓటర్ల జాబితాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాదాలు లేని పక్కా ఓటర్ల జాబితాలను తయారు చేయాల్సిన బాధ్యత బూత్ స్థాయి అధికారులపై ఉందన్నారు.

మట్టి దారి.. అధ్వానంగా మారి

గజపతినగరం మండలం బంగారమ్మపేట నుంచి మెంటాడ మండలం కొంపంగి, ఇద్దనవలస గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. వర్షం కురిస్తే బురదమయమై రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నామని పరిసర గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిని అభివృద్ధి చేయాలని వారంతా కోరుతున్నారు. సమస్యను పీఆర్ డీఈ అప్పలనాయుడు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పరిశీలించి అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. – న్యూస్‌టుడే, గజపతినగరం



విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

వివరణ కోరుతూ మెమో జారీ

ఈనాడు కథనానికి స్పందన

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలస పట్టణంలో కుమ్మరవీధికి ఎదురుగా రామాలయానికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన వ్యర్థాలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై శనివారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి డీఎల్‌డీవో శిరీషారాణి స్పందించి.. కొత్తవలస డిప్యూటీ ఎంపీడీవో వివరణ కోరుతూ మెమో జారీ చేశారు. సోమవారం ఉదయం 11 గంటలలోగా రాత పూర్వక వివరణ డీఎల్‌డీవో కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. వ్యర్థాల తొలగింపు విషయంలో అనేకసార్లు ఆదేశాలను బేఖాతరు చేసినట్లు పరిగణిస్తూ మెమో జారీ చేసినట్లు శిరీషారాణి తెలిపారు.

నగరపోరుకు సమాయత్తం

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అక్టోబరు నెలాఖరు నాటికి రాష్ట్రంలో ఎటువంటి వివాదాలు లేని పుర, నగరపాలిక, నగర పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. వీటిలో జిల్లా కేంద్రం విజయనగరం నగరపాలక సంస్థ కూడా ఉంది. ఇటీవల నగరపాలికలోని 50 డివిజన్లను ఈ ఏడాది జనవరి 1వ తేదీ నాటి ఓటర్ల జాబితా ప్రకారం 62 డివిజన్లుగా పునర్విభజన చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. అన్ని డివిజన్ల వారీగా ఫొటోతో కూడిన ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ తుది దశకు చేరింది. అయితే పెరిగిన 12 డివిజన్లే ఇప్పుడు కీలకం కానున్నాయి. వీటిపై పట్టు సాధించేందుకు ఆయా రాజకీయ పార్టీలు వ్యూహ రచన చేస్తున్నాయి.

కీలకం కానున్న కొత్తగా పెరిగిన 12 డివిజన్లు

సర్దుబాటు ఓటర్ల ఆధారంగానే..

సర్దుబాటు చేసిన ఓటర్ల ఆధారంగానే రిజర్వేషన్లు ఖరారవుతాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఎన్నికల్లో ఓటర్ల జాబితా తయారీలో అవకతవకలు చోటుచేసుకున్నాయని.. ఒక డివిజన్‌లో ఓటర్లను ఇంకో డివిజన్‌లో కలిపేశారన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం ఆ విధమైన తప్పిదాలు లేకుండా అధికారులు జాగ్రత్త వహిస్తున్నారు.

ఆశావహుల్లో ఉత్కంఠ

మేయర్ ఎన్నిక ఈ సారి ప్రత్యక్ష విధానంలో జరగనుంది. దీంతో అభ్యర్థి రిజర్వేషన్‌పై రాజకీయ పార్టీల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మేయర్ రిజర్వేషన్‌ను రాష్ట్ర యూనిట్‌గా తీసుకొని పురపాలిక పరిపాలన విభాగం.. కార్పొరేటర్ రిజర్వేషన్‌ను జిల్లా కలెక్టర్ ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులను బరిలో నిలిపే విషయంలో ఆయా రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నాయి. అదే విధంగా కార్పొరేటర్ల రిజర్వేషన్లపైనా ఆసక్తి నెలకొంది. ఓటు విషయానికి వస్తే.. అన్ని డివిజన్లలో ఓటర్లు మేయర్ అభ్యర్థికి ఒక ఓటు, కార్పొరేటర్‌కు మరొకటి వేయాల్సి ఉంటుంది. రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో తెదేపా ఏకపక్షంగా స్థానాలు గెలుచుకుంది. సాధారణంగా స్థానిక ఎన్నికలు అధికార పార్టీకే అనుకూలంగా ఉండడం గత కొంత కాలంగా ఆనవాయితీగా వస్తోంది.

మార్గదర్శకాలకు అనుగుణంగా..: నగరంలోని 62 డివిజన్ల పరిధిలో ఓటర్ల జాబితా విభజన ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. తుది జాబితాను వచ్చే నెల 3వ తేదీన ప్రచురిస్తాం. వలస వెళ్లినవారు, రెండుసార్లు నమోదు, మృతులు ఓటర్లుగా ఉండడంపైన స్పష్టత రావాల్సి ఉంది. బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరగనున్నందున డివిజన్‌కు నాలుగు చొప్పున బాక్సులు అవసరం ఉంటుందని సమాచారం ఇచ్చాం.

- బి.బాలస్వామి, కమిషనర్, నగరపాలక సంస్థ

తెరపై ఈనాడు

● ఎన్సీఎస్ : ఇరుముడి ● శ్రీకృష్ణ : టాక్సిక్ ● లీలామహల్ : టాక్సిక్ ● రంజనీ స్క్రీన్-I : టాక్సిక్ ● శివరంజనీ స్క్రీన్-2 : ఇరుముడి ● సప్తగిరి : విశ్వనాథ్ అండ్ సన్స్ ● హిమగిరి : ఇరుముడి

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

విద్యార్థులకు పద్య సూక్తుల పోటీ

కొత్తవలస, న్యూస్‌టుడే: విద్యార్థులకు కొత్తవలస సాయి ప్రశాంతి మందిరంలో ఆదివారం పద్య సూక్తుల పోటీ నిర్వహించారు. 1 నుంచి 5వ తరగతి చదువుతున్న వివిధ పాఠశాలలకు చెందిన 62 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పి. రవికుమార్ తెలిపారు. విజేతలకు బహుమతులు, పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు.







సొసైటీ స్థలం ఆక్రమించారని ఫిర్యాదు

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ గ్రామంలో సర్వే నంబర్ 143-2లో ఉన్న కో-ఆపరేటివ్ సొసైటీకి చెందిన 28 సెంట్ల స్థలం ఆక్రమణకు గురైందని డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు దంతులూరి ప్రదీప్‌రాజు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. గ్రామంలో 1985లో సొసైటీ కార్యాలయం అద్దె భవనంలో నిర్వహించేవారు. అప్పటి సొసైటీ అధ్యక్షుడు జి.వి.ఎస్.రాజు పెదతాడివాడ గ్రామానికి చెందిన బాడితమాని అప్పలస్వామి వద్ద స్థలం కొనుగోలు చేసి డీసీసీబీకి రిజిస్ట్రేషన్ చేశారు. నాబార్డు నిధులతో కొత్త భవనం నిర్మించారు. అనంతరం సొసైటీ నష్టాల్లో ఉండడంతో డెంకాడ పీఏసీఎస్‌లో విలీనం చేశారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న సొసైటీ స్థలాన్ని కొంతమంది ఆక్రమించేందుకు చదును చేయడంతో. . అడ్డుకొని రెవెన్యూ, డీసీసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ప్రదీప్‌రాజు తెలిపారు. దీనిపై పెదతాడివాడ వీఆర్‌వో రామకృష్ణను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఎఫ్‌సీవో, వెబ్‌ల్యాండ్‌లో రైతుల పేరు మీద ఆ స్థలం ఉందని, సొసైటీకి రిజిస్ట్రేషన్ చేయించిన పత్రాలు ఉంటే పరిశీలించి.. స్థలాన్ని చట్టబద్ధంగా అప్పగిస్తామన్నారు. ప్రస్తుతం చదును చేసే పనులు నిలిపివేసినట్లు తెలిపారు.

కొత్తవలసలో ప్రేమ ప్రవాహిని రథ యాత్ర



రథం వద్ద సాయి భక్తులు

కొత్తవలస, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథ యాత్ర కొత్తవలస పట్టణానికి చేరుకుంది. సత్యసాయి సేవా సంస్థలు కొత్తవలస జోన్-3 తరఫున స్వాగతం పలికారు. ప్రధాన రహదారుల్లో యాత్ర నిర్వహించారు. ఆగస్టు 1న శ్రీకాకుళంలో మొదలైన ఈ యాత్ర ఆ జిల్లాతో పాటు పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలో కొత్తవలసతో పూర్తి చేసుకున్నట్లు కొత్తవలస కన్వీనర్ పి.రవికుమార్ తెలిపారు. ఇక్కడ నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకి రథం పయనమైందన్నారు.

పసలమ్మ పండగ: కొత్తవలస: కొత్తవలస మేజర్ పంచాయతీ శివారు రాజపాత్రునిపాలెంలో ఆదివారం పసలమ్మ పండగ నిర్వహించారు.

4 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ఉడాకాలనీ: ప్రబోధా సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయనగరం శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4 నుంచి 8 వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు శాఖ అధ్యక్షుడు వానపల్లి శంకరరావు తెలిపారు. ఆదివారం తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చేతులమీదుగా ఆహ్వాన ప్రతులను ఆవిష్కరించారు. సభ్యులు నాయుడు, భాను, జయ పాల్గొన్నారు.





ఆలయాల నిర్మాణానికి నిధుల మంజూరు

లక్కవరపుకోట, వేపాడ, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పలు ఆలయాల నిర్మాణానికి తితిదే శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధుల మంజూరుకు ఆమోదం లభించిందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. కొత్తవలస మండలం ముసిరాం గ్రామంలో ముత్యాలమ్మ, వీరభద్రపురంలో కోటమ్మ, ఎంఆర్‌పురంలో బంగారమ్మ, రాజపాత్రునిపాలెంలో రావాలమ్మ ఆలయాలు.. ఎల్.కోట మండలం తామరాపల్లిలో మరిడమ్మ ఆలయం, వేపాడ మండలం కృష్ణారాయుడుపేటలో బంగారమ్మ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో దానికి రూ.40 లక్షలు చొప్పున ఇచ్చినట్లు పేర్కొన్నారు. వెనుకబడిన ప్రాంతాల్లో ఈ ఆలయాల నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. ★ కృష్ణారాయుడుపేట బంగారమ్మ ఆలయానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు తెదేపా వేపాడ మండల ఉపాధ్యక్షుడు పోతల వెంకటరమణ, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

టెట్ మినహాయించాలని డిమాండ్

విజయనగరం విద్యావిభాగం, నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆదివారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా పరిషత్తు వద్ద రాష్ట్ర నాయకులు డి.రాము, కె.విజయగౌరి ప్రారంభించారు. కోట, మూడు లాంతర్లు, గంటస్తంభం మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతా భాస్కర్, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ★ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాథ్ ఆధ్వర్యంలో నెల్లిమర్లలో బైక్ ర్యాలీ నిర్వహించారు.



విజయనగరం: ర్యాలీలో ఉపాధ్యాయులు





ముఖ్య శిక్షకులకు శిక్షణ

కొత్తవలస: ఆర్ఎస్ఎస్ కొత్తవలస ఖండ ముఖ్య శిక్షకుల అభ్యాస వర్గ అప్పన్నపాలెం వద్ద ఉన్న ఓపీ జిందాల్ భారతి పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు కొత్తవలస ఖండలో 36 గ్రామాల్లో ఏడు రోజులు శాఖలు నిర్వహించే ముఖ్య శిక్షకులకు దీంట్లో శిక్షణ ఇచ్చారు. విభాగ్ ప్రచారక్ జి.రాజశేఖర్ ముఖ్యవక్తగా మార్గదర్శనం చేశారు. కొత్తవలస ఖండ కార్యవాహ బి.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవాహ ఎం.రమణ, శాఖ ముఖ్య శిక్షకులు, శిక్షణ, యోజన ప్రముఖ్‌లు పాల్గొన్నారు.

సభ్యుల ఆర్థికాభివృద్ధికి కృషి

విజయనగరం ఉడాకాలనీ: విజయనగరం పట్టణంలో విశాఖ భట్రాజు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సంఘ రాష్ట్ర కార్యదర్శి సతీష్‌రాజు మాట్లాడుతూ.. సభ్యుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఉత్తరాంధ్ర భట్రాజు సంఘ సభ్యులకు రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు.. వితంతువులకు నెలకు రూ.2 వేలు పింఛను అందించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

పౌరహక్కులు అందరికీ సమానం

శృంగవరపుకోట, నెల్లిమర్ల(డెంకాడ): పౌర హక్కులు అందరికీ సమానమని తహసీల్దార్ డి.శ్రీనివాసరావు అన్నారు. ఎస్.కోట మండలం మామిడిపల్లిలో ఆదివారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. అంటరానితనం, బాల కార్మిక వ్యవస్థ వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ● డెంకాడ మండలం దొడ్డి బాడువా గ్రామాన్ని తహసీల్దార్ ఎన్.రాజారావు సందర్శించి.. పౌర హక్కులపై అవగాహన కల్పించారు.

అభ్యంతరాలు లేకుండా చూడండి

నెల్లిమర్ల(భోగాపురం), వేపాడ: భోగాపురం, సవరవిల్లి పోలింగ్ కేంద్రాలను భోగాపురం మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు ఆదివారం సందర్శించారు. సర్ సర్వేలో అభ్యంతరాలు లేకుండా చూడాలని ఆదేశించారు. సుందరపేట కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో.. ఆసుపత్రి పరిసరాల శుభ్రతపై ఆరా తీశారు. ● వేపాడ మండలం వల్లంపూడి, కుంపల్లి, కృష్ణారాయుడుపేట, వేపాడ, వావిలపాడు పోలింగు కేంద్రాల వద్ద నిర్వహించిన సర్ ప్రత్యేక శిబిరాలను తహసీల్దార్ జె.రాములమ్మ, ఉప తహసీల్దార్ పి.రామకృష్ణ పరిశీలించారు.

6న జిల్లా మహాసభ

మయూరి కూడలి, నెల్లిమర్ల: ఆటో యూనియన్ జిల్లా మహాసభ సెప్టెంబరు 6న జరగనుందని, విజయవంతం చేయాలని విజయదుర్గ ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.అప్పలరాజు, రెడ్డి నారాయణరావు కోరారు. ఆదివారం విజయనగరం ఆర్టీసీ కూడలి వద్ద యూనియన్ నాయకులు, చోదకులతో ర్యాలీ చేపట్టారు. ఉచిత బస్సుల కారణంగా ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు ధర్మారావు, సన్యాసిరావు పాల్గొన్నారు. ★ నెల్లిమర్ల కొండగుంపాం కూడలిలో ఆటో వర్కర్ల సమావేశం జరిగింది. మద్దిల కృష్ణారావు, మొయిద రాంబాబు, నల్లి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నెల్లిమర్ల: దీపిల్లిపేటకు చెందిన సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి ఆదివారం తెదేపా మండల ప్రధాన కార్యదర్శి చక్రధర్ రూ.5 వేలు, 50 కిలోల బియ్యం అందజేశారు.



అలరించిన సంగీత కచేరీ

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయనగరం రామనారాయణంలో ఆదివారం రాత్రి ఒమేగా మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు గురువు శ్రీదేవి ఆధ్వర్యంలో సంగీత కచేరీ నిర్వహించారు. భక్తి గీతాలు ఆలపించారు.



ఆదిభట్ల జయంతి ఉత్సవాలు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఆదిభట్ల నారాయణదాసు ఆరాధనోత్సవ సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 31, సెప్టెంబరు 1వ తేదీల్లో ఆదిభట్ల 162వ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి ఎ.గోపాలరావు ఆదివారం తెలిపారు. తాడేపల్లిగూడెంకు చెందిన కవురు శారదకు హరికథా చూడామణి బిరుదు ప్రదానం చేస్తామన్నారు.





